క్లుప్తంగా

హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శనివారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి వర్ష, అర్చన రవి, నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పండుగలకు ప్రత్యేక డిజైన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఇనార్బిట్‌మాల్‌లో బుగాటి షూ స్టోర్ ప్రారంభం



స్టోర్‌ను ప్రారంభించిన ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్

మాదాపూర్: హైదరాబాద్ అంతర్జాతీయ ఖ్యాతి పొందిన నగరమని తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. శనివారం ఇనార్బిట్‌మాల్‌లో దేశంలో మూడవ బుగాటి స్టోర్‌ను నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఐటీ కంపెనీలు, పరిశ్రమల ఉద్యోగులు అంతర్జాతీయ బ్రాండ్‌లను వాడుతారని అలాంటి వారికి అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. ఆస్టర్ మ్యూల్లర్ సీఓఓ రిటైల్ హెడ్ సందీప్ బక్షీ మాట్లాడుతూ మహిళలు, పురుషులకు కావాల్సిన ప్రత్యేక షూలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

కళ్లద్దాలు పంపిణీ



శిబిరంలో కళ్లద్దాలను అందజేస్తున్న రవికుమార్ యాదవ్

మియాపూర్ : మియాపూర్‌లోని ఎంఏనగర్, స్టాలిన్ నగర్ కాలనీలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ సెక్రటరీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ హాజరై ప్రారంభించి 600 మందికి కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేంద్రరావు, మాణిక్‌రావు, మన్యం, గౌతమ్, రవికాంత్, రమేష్‌ముదిరాజ్, లక్ష్మణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

మియాపూర్ : మియాపూర్ డివిజన్ పరిధిలోని మక్తమహబూబ్‌పేట గ్రామంలో సర్వే నంబర్ 77లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమణల బారి నుండి కాపాడాలని మక్తమహబూబ్‌పేట్ గ్రామ కమిటీ సభ్యులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని కిందికుంట చెరువుకట్ట కింది భాగంలో సర్వే నంబర్ 77లో సుమారు 12 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. గత సంవత్సరం ఈ భూమిని ఆక్రమించుకునేందుకు కొంతమంది ప్రైవేటు వ్యక్తులు రేకుల షెడ్డు వేయగా అధికారులకు ఫిర్యాదు చేయడంతో అప్పట్లో అధికారులు వాటిని కూల్చివేశారు. మరలా అదే స్థలంను ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరారు.

నిరంతర అభ్యాసం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని సుమన్ జూనియర్ కళాశాలలోని మహిళా దక్షత సమితి ఆడిటోరియంలో శనివారం భవిష్యత్తులో ఐటీ రంగంలో ఉద్యోగావకాశాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ మైక్రో సాఫ్ట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, సంఘ సేవలు శ్రీదేవి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు కమ్యూనికేషన్ చాలా ముఖ్యమన్నారు. నిరంతర అభ్యాసం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. జీవితంలో ఉన్నతమైన విషయాలలో విజయం సాధిస్తారన్నారు.

హెచ్‌సీయూకు నిధుల వరద

- అయిదేళ్ల పాటు ఏటా రూ.1000 కోట్లు
- ఆధునిక సౌకర్యాలతో అందుబాటులోకి కొత్త భవనాలు
- రూ.81.27 కోట్ల భవనాలను ఇటీవల ప్రారంభించిన ప్రధాని

2019లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్‌గా గుర్తింపు



స్కూల్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్



లెక్చర్ హాల్ కాంప్లెక్స్-3 భవనం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఏటా కొత్త భవనాలు, మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయి. 2019లో హెచ్‌సీయూకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్‌గా కేంద్ర ప్రభుత్వం యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ సిఫార్సుతో గుర్తింపు ఇవ్వడంతో నిధుల వరద పెరుగుతోంది. ముఖ్యంగా అయిదేళ్ళ పాటు 2019 నుంచి ఏటా రూ.1000 కోట్ల నిధులు ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో కొత్త భవనాల నిర్మాణం ఊపందుకుంది. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ ప్రత్యేక చొరవతో పనులు వేగవంతమయ్యాయి. 2023 ఏడాదిలో పలు భవనాలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా విదేశీ విద్యార్థులకు, ఫ్యాకల్టీ కోసం ప్రత్యేక వసతులతో కూడిన భవనాలు, గెస్ట్ హౌజ్, లెక్చర్ హాల్ కూడా అందుబాటులోకి రావడం విశేషం. కొంతమంది ఉద్యోగులకు కూడా టైప్- ఏ క్వార్టర్స్ నిర్మించారు.



హెచ్‌సీయూలో కొత్తగా నిర్మించిన స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ భవనం

ఈ ఏడాది అందుబాటులోకి వచ్చిన భవనాలు..

- రూ.81.27 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలను ప్రధాని నరేంద్రమోడీ ఆదివారం ప్రారంభించారు.
- హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ (అనుబంధం) భవనాలతోపాటు లెక్చర్ హాల్ కాంప్లెక్స్-3 భవనాన్ని ప్రధాని ప్రారంభించారు.
- రూ.9.43 కోట్లతో హెచ్‌సీయూలో మల్టీ స్టోర్డ్ బ్లాక్ టైప్ ఏ క్వార్టర్స్ నిర్మాణం
- రూ.7.99 కోట్లతో ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ హాస్టల్ (50 రూమ్స్) భవనాల నిర్మాణం
- రూ.3.29 కోట్లతో ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ హౌస్ నిర్మాణం
- రూ.2.2 కోట్లతో సౌత్ క్యాంపస్ గెస్ట్ హౌజ్ (పది గదులతో) నిర్మాణం
- స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఇంటిగ్రేటెడ్ భవనం కూడా అందుబాటులోకి వచ్చింది.









ఈ ఏడాది అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి వచ్చిన భవనాలు ఇవే

నైపుణ్యం ఉంటే ఉపాధి అవకాశాలు మెండు

హైదరాబాద్ స్కిల్ గ్రాడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కిరణ్



విజయ్‌కిరణ్‌కు పూలమొక్కను అందిస్తున్న కళాశాల కార్యదర్శి సుధీర్

రాయదుర్గం: విద్య, ఉద్యోగ రంగాలలోని వారు ముఖ్యంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని హైదరాబాద్ స్కిల్ గ్రాడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కిరణ్ అగస్త్య పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలో సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు సాఫ్ట్‌స్కిల్స్ నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. అర్హతతోపాటు నైపుణ్యం కలిగిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుని ఉద్యోగం సంపాదించే కన్నా ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారి ఇతరులకు ఉపాధి కల్పించేలా ఎదిగేందుకు ప్రణాళిక రూపొందించుకొని ముందుకుసాగాలన్నారు. అరవింద్ ఫార్మా లిమిటెడ్ కార్పొరేట్ హెచ్‌ఆర్ సత్యప్రసాద్‌రాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఆర్థిక లక్ష్యాలు ఉండాలని, ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం కళాశాల కార్యదర్శి కె సుధీర్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ చంద్రమౌళి అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ టి రవి, ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ టి రవి, హెచ్‌ఓడీ డి శ్రీలత, కె శ్వేత, కె భారతి, ఎంబీఏ మొదటి, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తాల్ ఉత్సవ్- 2023



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శనివారం తలసేమియా సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్)25 సంవత్సరాల వార్షికోత్సవ వేడుకలను తాల్ ఉత్సవ్- 2023 పేరిట అపోలో హోమ్ హెల్త్‌కేర్ లిమిటెడ్ సీఈఓ డాక్టర్ మహేశ్జోషి, తలసేమియా సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్‌లు ప్రారంభించారు. వేడుకలలో తలసేమియా బాధిత చిన్నారులు నృత్యప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. అవేర్, షేర్, కేర్, క్యూర్ ఫర్ తలసేమియా థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్‌సీఎస్ వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎస్ రత్నావళి, సెక్రటరీ డాక్టర్ సుమన్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

కనువిందు.. కళా ప్రదర్శనలు





మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న గుజరాత్ హస్తకళా ఉత్సవ్ 2023 నేటితో ముగియనుంది. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్యం, కూచిపూడి నృత్యప్రదర్శనలు నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి ఆశకుమార్ ఆనందనర్తన గణపతిం, సరోజాక్షి వర్ణం, దారిచూడు పదం తదితర అంశాలను ప్రదర్శించారు. ప్రముఖ కూచిపూడి గురువు అపర్ణ ధూళిపాళ శిష్యబృందం పూజానృత్యం, వినాయకకౌతం, జతిస్వరం, కొలువై ఉన్నదే, దశావతార శబ్దం, జయజయదుర్గే, అలరులు కురియగా, దరువు, తిల్లాన, మంగళం, తదితర అంశాలను కళాకారులు ఆరుషి, ఐశ్వర్య, అనన్య, హన్సిక, నిత్యశ్రీ, శ్రీనిక, శ్రీకృతి, సురభి, యామిని ప్రదర్శించారు.

అభివృద్ధిలో ఆదర్శం రుద్రారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గత పాలకుల హయాంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అవినీతికి చిరునామాగా నిలిస్తే నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి పథకం పేదవాడి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో 5 కోట్ల 7 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన.. ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ అవసరాలకు అనుగుణంగా ప్రజల సమక్షంలో ప్రణాళికలు రూపొందిస్తూ పారదర్శకతతో పనులు చేస్తున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికలలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రుద్రారం గ్రామం నుండి గీతం యూనివర్సిటీ వరకు రెండు కోట్ల 25 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, మహిళా సమాఖ్య భవనం, మార్కెట్ యార్డ్, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పోచారం గ్రామ పరిధిలోని గణపతి గూడెంలో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సుష్మా శ్రీ,జెడ్పీటీసీ సుప్రజా, గ్రామ సర్పంచ్ సుధీర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

శేరిలింగంపల్లి జోన్ బృందం: శేరిలింగంపల్లి నియోజకవర్గంను అన్ని రంగాలలో ఆదర్శంగా నిలుపుతున్నామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లో రూ.2.41 కోట్లు, రూ.75 లక్షల ప్రత్యేక నిధులతో, గచ్చిబౌలి డివిజన్‌లో రూ.83 లక్షలు, హఫీజ్‌పేట్ లో రూ.6లక్షలతో, శేరిలింగంపల్లి డివిజన్‌లో రూ.1.90 కోట్లతో, రూ.50 లక్షల ప్రత్యేక నిధులతో, మాదాపూర్ డివిజన్‌లో రూ.82 లక్షలతో, రూ.1.10 కోట్ల ప్రత్యేక నిధులతో, భారతినగర్‌లో రూ.4.63 కోట్లతో పలు అభివృద్ధి పనులకు, మియాపూర్ డివిజన్‌లో రూ.4 కోట్లతో చేపట్టే థీమ్‌పార్కు సుందరీకరణ పనులకు, అభివృద్ధి, నిర్మాణ పనులకు ఆయన కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి, రాగంనాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, సింధుఆదర్శ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ, మోడల్ రోడ్ల నిర్మాణం వంటివి చేపట్టడంతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోయాయ న్నారు. భారతీనగర్‌లో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు డాక్టర్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చేసే సత్తా బీఆర్ఎస్ పార్టీకే ఉందన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రమశిక్షణే దిక్సూచి



సాక్షి, సిటీబ్యూరో : నాసర్ స్కూల్ 58వ యాన్యువల్ స్పోర్ట్స్‌మీట్ శనివారం ఉత్సాహభరితంగా జరిగింది. ఎల్‌బీ స్టేడియం ఆవరణలో నిర్వహించిన ఈ మీట్‌లో విద్యార్థులు పలు రకాల ఈవెంట్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీజీపీ తేజ్‌దీప్ కౌర్ మీనన్ మాట్లాడుతూ విద్యార్థిగా నేర్చుకున్న క్రమశిక్షణ జీవితాంతం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ స్వప్న, ప్రిన్సిపల్ మీర్ మొహియుద్దీన్, సుమతి పాల్గొన్నారు. విజేత విద్యార్థులను మెమెంటోలతో అభినందించారు.

ఆలోచించి ఓటు వేయండి

హఫీజ్‌పేట్ : బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనని ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం చందానగర్ డివిజన్ పరిధిలోని తారానగర్ ఓల్డ్ విలేజ్, సాయి మారుతీ కాలనీ, ఇంద్రనగర్ తదితర ప్రాంతాలలో బీజేపీ పార్టీ గడపగడపకు రవన్న ప్రజాయాత్ర నిర్వహించారు కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రాధకృష్ణ యాదవ్, ఎల్లేష్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన స్ప్రింగర్ నేచర్ టీమ్



రాయదుర్గం: భారతదేశంలో పరిశోధన, ఆవిష్కరణలు, జ్ఞానాన్ని పంచుకోవడంపై సమగ్ర విధానాన్ని కలిగి ఉందని స్ప్రింగర్ నేచర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేష్ సర్వసిద్ధి పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ, హెచ్‌సీయూ సంయుక్త ఆధ్వర్యంలో స్ప్రింగర్ నేచర్ ఇండియా రీసెర్చ్ టూర్ నేపథ్యంలో హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్-హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో ఈ బుక్స్ పాత్రపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రత్యేకించి మహిళా పరిశోధకులకు సాధికారత కల్పించడానికి, విద్యార్థినులకు ప్రవేశాన్ని సులభతరం చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. భారతీయ విద్యారంగంలో వైవిధ్యం, సమానత్వంను ప్రోత్సహిస్తామన్నారు. హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ క్యూఎస్, ఎన్ఐఆర్ఎఫ్ ద్వారా టాప్ ర్యాంకింగ్ సంస్థగా గుర్తింపు పొందడంతో పాటు హెచ్‌సీయూ మొదటి స్థానంలో ఉందన్నారు. నేచర్ ఇండెక్స్ ర్యాంకింగ్స్-2023 తమ ఫ్యాకల్టీ, పరిశోధకులు చేపట్టిన పరిశోధన నాణ్యతను చూపుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ డీన్ ప్రొఫెసర్ అశ్విని నంగియా, ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు, డాక్టర్ అరవింద్ సుసర్ల, డాక్టర్ జోవాన్‌జోస్‌లు స్ప్రింగర్ నేచర్ టీమ్ బృందంతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం హెచ్‌సీయూకు చెందిన 9 మంది మహిళా శాస్త్రవేత్తలు పరిశోధన- మన భవిష్యత్తు అనే అంశంపై పోస్టర్ ప్రదర్శనలు చేయగా వారికి అవార్డులు అందించారు.

బతుకమ్మ చీరల పంపిణీ

శేరిలింగంపల్లిజోన్ బృందం: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళలో శనివారం ప్రారంభమైంది. పలుచోట్ల నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు హమీద్‌పటేల్, గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, మంజులారఘునాథ్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్‌లు చీరలు పంపిణీ చేశారు.



చందానగర్‌లో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ



గోపన్‌పల్లిలో.. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



కొండాపూర్ డివిజన్‌లో.. కార్పొరేటర్ హమీద్‌పటేల్